నరేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న పీఈటీలు, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు

క్రీడారంగానికి అధిక ప్రాధాన్యం

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వీ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి, అక్టోబర్ 20: రాష్ట్రంలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వీ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ సమావేశ మందిరంలో వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పీఈటీల నుంచి పీడీలుగా పదోన్నతులు పొందిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులను నరేందర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఉత్తర తెలంగాణ కేంద్రంగా అతిపెద్ద స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా మైదానాలకు ప్రహరీ నిర్మాణం చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ప్రోత్సాహాలు అందిస్తూ ఉత్తమ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు చట్టసభల్లో పోరాడుతానని తెలిపారు.

జాతీయస్థాయిలో పతకాలు సాధించాలి

రాష్ట్రస్థాయికి ఎంపికైన యోగా క్రీడాకారులతో చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్

కొత్తపల్లి, అక్టోబర్ 20: జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పతకాలు సాధించాలని రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులనుద్దేశించి, మాట్లాడారు. ఈనెల 24 నుంచి 28వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ఊనాలో జరిగే జాతీయ యోగాసన చాంపియన్‌షిప్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించే బాలబాలికలు సత్తా చాటాలన్నారు. జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ క్రీడాకారులకు ఆర్థిక సాయం అందించారు. అండర్ 8-10 విభాగంలో డీ కృప సూరజ్, అండర్ 10-12విభాగంలో బీ సాకేత్, ఎన్ ఆదిత్య, అండర్ 12-14విభాగంలో పీ దీపక్, టీ హర్షిత్, బాలాజీ, అండర్ 14-16విభాగంలో బీ ఇందుప్రియ, అండర్16-18 విభాగంలో పీ అభికుమార్ జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారని యోగా అసోసియేషన్ కార్యదర్శి సిద్ధారెడ్డి తెలిపారు. రాష్ట్ర జట్టు కోచ్‌గా కోటేశ్వరరావు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడాకారులను పాఠశాల యోగా కోచ్ కిష్టయ్య, ఆనంద్‌కుమార్, కోటేశ్వరరావు, తిరుపతి అభినందించారు.

ఎల్ ఎండీ గేట్లు విడుదల

తిమ్మాపూర్, అక్టోబర్20: లోయర్ మానేర్ డ్యామ్‌కి ఇన్‌ఫ్లో పెరగడంతో ఆదివారం ఉదయం అధికారులు దిగువకు నీటిని వదిలారు. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా మిడ్‌మానేర్‌కు ఇన్‌ఫ్లో వస్తుండగా, అక్కడి నుంచి 4,300 క్యూసెక్కుల నీటిని ఎల్ఎండీకి వదిలారు. ఇదివరకే నిండుగా ఉన్న ఎల్ఎండీ నుంచి.. ఇన్‌ఫ్లో అనుగుణంగా రెండు గేట్లు ఫీటు చొప్పున తెరిచి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. 24.034టీఎంసీల సామర్థ్యం గల ఎల్ ఎండీలో ప్రస్తుతం సరిమట్టం నీళ్లున్నాయి.

సమస్యలు పరిష్కరించకుంటే

సమ్మెకు వెనుకాడం

- కరీంనగర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న జిల్లా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి

కొత్తపల్లి, అక్టోబర్ 20: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు వెనుకాడేది లేదని ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక మంకమ్మతోటలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో భాగస్వామ్య సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, అందరికీ ఆమోదయోగ్యమైన పీఆర్సీ, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు భరోసా కల్పించే మెడికల్ హెల్త్‌స్కీం, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పెండింగ్ బిల్లుల మంజూరు, 317 బాధితులకు న్యాయం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పలువురు సంఘాల బాధ్యులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటి వరకు సమస్యల సాధన కోసం జేఏసీ నాయకులను చర్చలకు పిలువకపోవడం ఉద్యోగులపై ప్రభుత్వానికి ఏ మేర చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను అమలు చేయడంలో ముందుంటామని పేర్కొంటూ ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకుంటే సకలజనుల సమ్మె తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ రావు, నాయకులు కట్ట రవీంద్రాచారి, పీఆర్ శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, తూముల తిరుపతి, నరహరి, గోనె శ్రీనివాస్, ముల్కల కుమార్, ఆదర్శన్‌రెడ్డి, ఎంఎ ఖాద్రి, ఖాజా మంజూర్‌అలీ, కరుణాకర్, చంద్రశేఖర్, వెలిచాల వెంకటస్వామి, పాతూరి రాజిరెడ్డి, రామ్మోహన్, రామస్వామి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి, అక్టోబర్ 20: కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సూచించారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి సుడా చైర్మన్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నదన్నారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 375 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈ నెల 28 నుంచి 30వ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం సభ్యులు వంగపల్లి సూర్య ప్రకాశ్, కట్ట సంతోష్ ఎస్‌కే మొయినుద్దీన్, శివకుమార్, గెల్లు మధుకర్, సంధ్య, కరుణాకర్, నవీన్ కుమార్ ఉన్నారు.

అన్ని సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

కార్పొరేషన్, అక్టోబర్ 20: నగరంలోని కశ్మీర్‌గడ్డలో అన్ని సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపడుతున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను మేయర్ పరిశీలించి, మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో పరిశుభ్రమైన వాతావరణం, అన్ని సదుపాయాలు, అన్ని రకాల మార్కెట్లు ఒకే దగ్గర ఉండాలన్న ఆలోచనతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నగరానికి నలువైపులా నిర్మించాలన్న ఆలోచనతో నాలుగు మార్కెట్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కాగా, ప్రస్తుత ప్రభుత్వం నుంచి నిధుల విడుదల సరిగా లేకపోవడం వల్ల నిర్మాణ పనుల్లో వేగం తగ్గిందన్నారు. ఈ మార్కెట్లతో వేజ్, నాన్ వేజ్ మార్కెట్లు అందుబాటులో ఉండే విధంగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కశ్మీర్‌గడ్డ రైతుబజార్‌లో ప్రజలకు మెరుగైన సేవలందించే విధంగా మార్కెట్ నిర్మాణం చేస్తున్నామన్నారు.

'అలయ్..బలయ్'తో

బీఆర్ఎస్ జోష్

తిమ్మాపూర్/తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్20: మానకొండూర్ నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ కుటుంబ అలయ్ బలయ్ ఆత్మీయ సమ్మేళనంతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నిండింది. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవడంతో క్యాడర్‌తో నూతనోత్సాహం కలిగింది. ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినా రసమయి బాలకిషన్ అందరినీ కలవానే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరు కాగా.. రాష్ట్ర ప్రభుత్వంపై హరీశ్‌రావు సెటైర్లు, రేవంత్‌రెడ్డిపై పంచులు వేశారు. రసమయి ఆటాపాటలతో ఉర్రూతలూగించారు. పలువురు కళాకారుల పాటలు అలరించాయి. అంతకుముందు హరీశ్‌రావును రసమయి బాలకిషన్‌తో పాటు జిల్లా నాయకులు కొత్తపల్లి స్టేజీ వద్ద ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. ఎల్ఎండీలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డిని హరీశ్‌రావు పిలుచుకుని అభినందించారు.

ఒకే ప్రయాణం.. వేర్వేరు ధరలు

- టీజీఆర్టీసీ టికెట్ ధరలపై ప్రయాణికుల ఆగ్రహం

హుజూరాబాద్-హన్మకొండకు వెళ్లినప్పుడు, తిరిగి వచ్చే క్రమంలో వేర్వేరు ధరలో ఇచ్చిన టికెట్లు

ఒకే గమ్యస్థానానికి వేర్వురు ధరలతో టికెట్లు ఇవ్వడంతో ఆర్టీసీ ప్రయాణికులు అవాక్కవుతున్నారు. హుజూరాబాద్ పట్టణం నుంచి ఓ ప్రయాణికుడు గత శనివారం హన్మకొండకు ఎక్స్‌ప్రెస్ బస్‌లో వెళ్లడంతో ₹50 టికెట్ ఇవ్వగా, తిరిగి హన్మకొండ నుంచి హుజూరాబాద్‌కు వచ్చేక్రమంలో ₹60టికెట్ ఇచ్చారు. ఇదేమిటని కండక్టర్‌ను ప్రశ్నించగా, టికెట్ మెషిన్‌లో ఇంకా రేట్లు మార్చలేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని ప్రయాణికుడు వాపోయాడు. హన్మకొండ నయీంనగర్‌లో బ్రిడ్జి పనులు ఉండడంతో చుట్టూ తిరగాల్సి వస్తోందని ₹50 టికెట్‌ను ₹60కి పెంచి సర్వీసులు నడపగా, అప్పుడు తక్షణమే టికెట్ ధరలు అమలు చేశారు. ప్రస్తుతం పనులు పూర్తయి నయీంనగర్ రహదారిపై రాకపోకలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ధరలు ఎందుకు తగ్గించడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.

- హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 20

దైవదర్శనానికి వెళ్లి సాన్నం చేస్తుండగా..

- కృష్ణా నదిలో మునిగి ఒకరి మృతి
- సీతంపేటలో విషాదం

వేణుగోపాల్ (ఫైల్)

ఇల్లందకుంట, అక్టోబర్ 20: దైవదర్శనానికి వెళ్లి పుణ్యాసాన్నం చేస్తుండగా.. కృష్ణా నదిలో మునిగి ఒకరి మృతి చెందారు. దీంతో మండలంలోని సీతంపేటలో విషాదం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. సీతంపేట గ్రామానికి చెందిన పోతన రాజేంద్రమ్-సరస్వతి దంపతుల కుమారుడు పోతన వేణుగోపాల్(38) ఈ నెల 17న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలో కృష్ణా నది సమీపంలో దత్తాత్రేయ స్వామి దర్శనానికి వెళ్లాడు. కృష్ణా నదిలో సాన్నం చేసేందుకు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయాడు. స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పోలీసుల సహకారంతో విచారణ చేపట్టగా, ఘటనా స్థలానికి 40కిలోమీటర్ల దూరంలో వేణుగోపాల్ మృతదేహం లభించింది. దీంతో సీతంపేటలో విషాదం నెలకొన్నది.

ఎల్ఎండీలో పడి యువకుడి మృతి

తిమ్మాపూర్, అక్టోబర్20: ప్రమాదవశాత్తు ఎల్ఎండీ రిజర్వాయర్‌లో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన బూర కనకయ్యకు ఇద్దరు బిడ్డలు, కొడుకు సాయికుమార్ (29) ఉన్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో సాయికుమార్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తానని కుటుంబ సభ్యులకు సాయికుమార్ ఫోన్ చేసి చెప్పాడు. తెల్లవారేసరికి ఇంటికి వస్తాడనుకున్న కొడుకు రాలేదు. ఫోన్ చేస్తే స్పందన రాకపోవడంతో ఆ తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులకు ఎల్ఎండీ రిజర్వాయర్‌లో సాయికుమార్ మృతదేహం ఉందని ఫోన్ రావడంతో అక్కడికి చేరుకుని బోరున విలపించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సాయికుమార్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

వివాహిత బలవన్మరణం

వీణవంక (హుజూరాబాద్ టౌన్), అక్టోబర్ 20: ఇప్పలపల్లికి చెందిన గువ్వల సంగీత చొప్పదండిలోని నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నది. రెండు నెలలుగా విపరీతమైన జ్వరంతో సంగీత బాధపడుతున్నది. చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంటిలోని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. కాగా, పదేండ్ల క్రితం సంగీత భర్త కొండయ్య సైతం అనారోగ్యంతో చనిపోయారు, సంగీత తల్లి మదనమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దుంకి వృద్ధురాలి..

ఇల్లందకుంట, అక్టోబర్20: బావిలో దుంకి వృద్ధురాలి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన కనుమల్ల భూమమ్మ(82)-మొండయ్య దంపతులకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. భర్త మొండయ్య కొద్ది రోజుల క్రితం చనిపోయాడు. నలుగురు బిడ్డలకు గతంలోనే పెండ్లి కాగా, పెద్ద కూతరు సరోజన తల్లి వద్దనే ఉంటున్నది. భూమమ్మ రెండేండ్ల క్రితం కాలు జారి పడగా, తొంటి విరిగింది. ఆపరేషన్ చేయించుకున్న నొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది శనివారం రాత్రి సమీప వ్యవసాయ బావిలో దుంకి ఆత్మహత్య చేసుకున్నది. కూతురు సరోజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రాజడి

బిల్లుల భారం తగ్గేదెలా?

క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..



క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.

బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్‌ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్-ఫ్రీ పీరియడ్‌ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్‌మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్‌కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్‌మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్‌మెంట్‌లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీ రేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీ రేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీరేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.



రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు

రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

పాడుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000 లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరిఅని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్లైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు-బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒక ట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.